


మంచిరోజులొచ్చాయ్..



పంచాయతీలకు కేంద్రం నిధులిస్తే గత వైసీపీ ప్రభుత్వం వాటిని మళ్లించింది. దీంతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. కూటమి అధికారం చేపట్టగానే రూ.250 కోట్లు నిధులు విడుదల చేయడం హర్షణీయం. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం సర్పంచ్‌లు, ప్రజల్లో ఏర్పడింది. మళ్లీ మంచిరోజులొచ్చాయి.

- ముత్యాలప్పనాయుడు, సర్పంచ్, ఉప్పునేశనపల్లి, ధర్మవరం మండలం

పల్లెకు పట్టం!



గ్రామ పంచాయతీలకు మహర్దశ

కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
సర్పంచ్‌లకే అధికారాలు
రూ.250 కోట్లు విడుదల
సర్పంచ్‌ల హర్షం





కొత్తచెరువు మేజర్ పంచాయతీ కార్యాలయం

ధర్మవరం, జూలై 13: గ్రామాల్లో సర్పంచ్‌లు అంటే పోటీకి ఎగబడేవారు. పంచాయతీలో సర్పంచ్‌కే సర్వాధికారులూ ఉండేవి. అభివృద్ధి పనులు మొత్తం సర్పంచ్ కనుసన్నల్లోనే సాగేవి. దీంతో పంచాయతీ ఎన్నికలు ఎప్పుడూ రసవత్తరమే. గత వైసీపీ పాలనలో సీన్ రివర్స్ అయింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో పైసా నిధులివ్వలేదు. పైగా కేంద్రం ఇచ్చిన నిధులను సైతం వాడేసుకుంది. గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. తొలుత గెలిచిన ఉత్సాహంలో సర్పంచ్‌లు సొంత డబ్బుతో పల్లెల్లో అభివృద్ధి పనులు చేశారు. బిల్లులు రాకపోతాయా అన్న నమ్మకం వారిని చాలా దూరమే తీసుకెళ్లింది. లక్షల రూపాయలు అప్పులు చేసి, ఖర్చు పెట్టారు. తర్వాత పరువు నిలుపుకునేందుకు అలానే అత్యవసర పనులు చేశారు. బిల్లులు రాలేదు. రోజులు, నెలలు, ఏళ్లు గడిచిపోయాయి. పైసా కూడా అందలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ గ్రామస్థులు నిలదీస్తుంటే వారికి మొహం చూపలేని దుస్థితిని ఎదుర్కొన్నారు. ఏ అధికారాలూ లేవు. గత వైసీపీ సర్కారు అధికారాలన్నీ సచివాలయాలకే కట్టబెట్టింది. సర్పంచ్‌లను దిష్టిబొమ్మలను చేసింది. ఈ నేపథ్యంలో అసలు.. తాము సర్పంచ్‌లు ఎందుకయ్యామా అని వైసీపీ మద్దతుతో గెలిచినవారే.. వాపోయారు. ఇక.. జీవితంలో మళ్లీ సర్పంచ్ బరిలో నిలిచేది లేదని నిర్ణయానికొచ్చారు. అంతలా.. గ్రామ పంచాయతీ వ్యవస్థను, ముఖ్యంగా సర్పంచ్‌లను గత వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయంతో పల్లెలకు పట్టం కట్టాలని నిర్ణయించారు. ఆ మేరకు వెంటనే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు విడుదల చేసింది ప్రభుత్వం. దీంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణుల్లో ఆశలు

కేంద్రం గతంలో 14, 15 ఆర్థిక సంఘాలు, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు వేలకోట్ల రూపాయల నిధులిచ్చింది. అప్పట్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించింది. దీంతో పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో గల్లీ నుంచి ఢిల్లీ దాకా నిరసనలు, పోరాటాలు చేశారు. అయినా గత వైసీపీ ప్రభుత్వం వీరి ఆక్రందనను పట్టించుకున్న పాపానపోలేదు. ఢిల్లీ వెళ్లి ధర్నా చేసినా.. కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమంటూ కేంద్రం దాటవేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు తీసుకున్న మొదటిరోజే అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వైసీపీ పాలనలో నిధులు దారి మళ్లించినట్లు, దుర్వినియోగమైనట్లు అధికారుల నివేదికలు ధ్రువీకరించాయి. దీంతో గత నాలుగేళ్లుగా సర్పంచ్‌ల సంఘం చేసిన ఆరోపణలు వాస్తవాలని తేలిపోయింది. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తిరిగి సర్పంచ్‌లకే అధికారాలు కట్టబెడుతూ నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రభుత్వ తీరుపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 483 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి కేంద్రం విడుదల చేసిన 14, 15 ఆర్థికసంఘాల నిధులు దాదాపు రూ.1000 కోట్లు, ఉపాధి హామీ పథకానికి చెందిన వేల కోట్ల రూపాయల నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. వ్యవస్థను నిర్వీర్యం చేసింది. గత వైసీపీ ప్రభుత్వ వైఖరి చూసి గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రారు అనే స్థాయికి వచ్చినట్లు పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజులకే గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో గ్రామస్థాయి రాజకీయ వాతావరణంలో సైతం మార్పు కనబడుతోంది. పల్లెలకు మళ్లీ మంచిరోజులు వచ్చాయని గ్రామీణులు చర్చించుకుంటున్నారు.

నిధుల విడుదల హర్షణీయం



గ్రామ పంచాయతీలకు రూ.250 కోట్ల నిధులు విడుదల చేయడం హర్షణీయం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం తీసుకువస్తామని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేయడం శుభపరిణామం. దీంతో గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం రానుంది.

- గోనుగుంట్ల భూషణ్, ఉమ్మడిజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

జిల్లాకు కొత్త పోలీసు బాస్

ఎస్పీగా వి.రత్న నియామకం.. పార్వతీపురం మన్యం జిల్లాకు మాధవరెడ్డి బదిలీ



నూతన ఎస్పీ వి.రత్న

పుట్టపర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తపోలీసు బాస్ ను ప్రభుత్వం నియమించింది. జిల్లా ఏర్పాటు తర్వాత మూడో ఎస్పీగా మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్‌గా వ్యవహరిస్తున్న వీ రత్నను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా ఎస్పీగా గతేడాది ఏప్రిల్ 13న బాధ్యతలు చేపట్టిన ఆయన 15 నెలలపాటు విధులు నిర్వర్తించారు.

మఠం భూమి కబ్జాపై ఉన్నతాధికారులు

సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విచారణకు ఆదేశం..!
అక్రమార్కుల్లో వణుకు
అధికారుల్లో గుబులు
అయోమయంలో అడ్వాన్సు చెల్లించిన రియల్టర్

బత్తలపల్లి, జూలై 13: మండలకేంద్రం సమీపంలోని నిడిమామిడి జంగం మఠం భూమి కబ్జాను జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. వంద కోట్ల రూపాయల విలువైన భూమి మఠం నుంచి కొందరు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లిందన్న దానిపై పూర్తిస్థాయి విచారణకు సన్నద్ధమయ్యారు. మఠం భూమి మటాస్... రూ.100 కోట్ల కబ్జా.. శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శనివారం ప్రచురించిన కథనం అక్రమార్కుల్లో గుబులు రేపింది. జిల్లావ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ కబ్జా బాగోతాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించినట్లు రెవెన్యూ శాఖ ద్వారా తెలుస్తోంది. ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని విచారణాధికారిగా నియమించినట్లు తెలుస్తోంది. జంగం మఠం భూమి అన్యాక్రాంతంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నారు. 1985లో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చూపుతున్న నేపథ్యంలో ఇది ఎలా సాధ్యమైందన్న కోణంలో అధికారులు విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. ఎవరు రిజిస్ట్రేషన్ చేయించారన్న వివరాలపై ఆరాతీస్తున్నట్లు రెవెన్యూ వర్గాల ద్వారా తెలుస్తోంది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో అక్రమార్కుల్లో గుబులు రేగుతోంది. ఎవరిపై వేటు పడుతుందోనని అధికారులు సైతం వణికిపోతున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు తిరిగి క్రయవిక్రయాలు సాగించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారిలో తీవ్ర ఆందోళన మొదలైనట్లు సమాచారం. ఇప్పటికే మఠం భూమి కాజేయడానికి భారీ ఎత్తున ముడుపులు అందజేసిన వారిలో మాత్రం డబ్బు పాయె.. భూమి కూడా దక్కేలా లేదన్న ఆందోళన నెలకొంది. ఈ భూమికి సంబంధించి క్రయవిక్రయదారులు శనివారం రహస్య ప్రదేశంలో సమావేశమైనట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎలా ముందుకు కదలాలన్న దానిపై మల్లాగుల్లాలు పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ భూమి వ్యవహారంలో మాజీ ప్రజాప్రతినిధి అనుచరుడైన ఓ రియల్టర్ కీలక భూమిక పోషించినట్లు తెలుస్తోంది. అతడే భూమిని కొనుగోలు చేసేందుకు ఇప్పటికే అడ్వాన్సు కూడా చెల్లించినట్లు సమాచారం. గత వైసీపీ హయాంలో భూ వ్యవహారాన్ని రాష్ట్రస్థాయిలో అతడే నడిపించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ భూమిపై వివాదం రేగడంతో ఆ రియల్టర్ అయోమయంలో పడినట్లు తెలుస్తోంది. భూమి కోసం ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టుకున్నట్లు చర్చ సాగుతోంది. కోట్ల రూపాయల విలువైన భూములను కబ్జా చేసినవారిని వెనకేసుకు రావడంతోనే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయిందని ధర్మవరంలో ఆ పార్టీ కౌన్సిలర్లే అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. భూ వ్యవహారంలో అధికారులు సైతం వణికిపోతున్నారు. ఎవరిపై వేటు పడుతుందోనని టెన్షన్ పడుతున్నారు.

పుట్టపర్తిలో వర్షం

పుట్టపర్తి రూరల్, జూలై 1: జిల్లాకేంద్రంలో శనివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారి జలమయమైంది. జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. నల్లమాడలో అత్యధికంగా 16.4 మి.మీ., వర్షపాతం నమోదైందన్నారు. అమడగూరు 15.2, గాండ్లపెంట 13.2, ఓబుళదేవరచెరువు 8.4, రొద్దం 6.4, కదిరి 5.2, పెనుకొండ 3.4, నంబులపూలకుంట 3.0, అమరాపురం 2.6, తలుపుల, కొత్తచెరువులో 2.2 మి.మీ, వర్షం కురిసినట్లు వివరించారు.



జిల్లా కేంద్రంలో జలమయమైన ప్రధాన రహదారి

ఆ వార్డుల ఆస్పత్రిని.. ఆవస్థల పాల్జేశారు..!

టీడీపీ హయాంలో పురం ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం

2016, 2018లో అవార్డులు
వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
కనీస వైద్యం అందని దుస్థితి
కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ ఆశలు
నేడు వైద్యులతో ఎమ్మెల్యే బాలయ్య సమావేశం



హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి ←
మాతాశిశు సంరక్షణ కేంద్రం →



హిందూపురం అర్బన్, జూలై 13: జిల్లాలోనే హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి పెద్దది. 2014 నుంచి 2019 వరకు ఆస్పత్రిలో కార్పొరేట్‌ను తలదన్నే వైద్యసేవలు అందేవి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆస్పత్రిపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఎన్నో వసతులు కల్పించారు. కావాల్సినంత మంది సిబ్బందిని నియమించారు. అధునాతన సామగ్రిని తెప్పించారు. ఆస్పత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేశారు. ప్రభుత్వ కార్పొరేట్ ఆస్పత్రిగా పేరు దక్కించుకుంది. రూ.20 కోట్ల నిధులు వెచ్చించి మాతాశిశు కేంద్రం నిర్మించారు. అందులో వెంటిలేటర్, ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. ఆస్పత్రి మొత్తం సెంట్రల్ ఆక్సిజన్ సిస్టం ఏర్పాటు చేయించారు. అత్యవసర సమయాల్లో కూడా రెఫర్ అనే మాట రాకుండా వైద్యం అందించేలా అన్ని సౌకర్యాలు కల్పించారు. అందుకే అప్పట్లో రోజూ దాదాపు ఓపీకి 900 నుంచి 1000 మంది వరకు రోగులు వచ్చేవారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పార్కులా శుభ్రంగా ఉండేవి. దీంతో 2016లో కాయకల్ప అవార్డు దక్కింది. ఆస్పత్రికి రూ.10 లక్షల రివార్డు అందించారు. 2018లో (ఎన్‌క్వాస్) నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్ ప్రతినిధులు ఆస్పత్రిని పరిశీలించి, అవార్డు ప్రదానం చేశారు. రూ.25 లక్షలు రివార్డు కూడా అందించారు. అలా.. హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. పురం పరిసర ప్రాంతాల నుంచేకాక కర్ణాటక నుంచి కూడా ప్రజలు.. వైద్యం నిమిత్తం వస్తుండేవారు.

వైసీపీ పాలనలో అధ్వానం

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక పురం ఆస్పత్రిపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. బడ్జెట్ కేటాయించకపోవడంతో ఆస్పత్రిలో కనీస మందులు కరువయ్యాయి. రోగులు బయట మందులు కొనుక్కోవాల్సిన పరిస్థితి కల్పించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రి అంటేనే వద్దు బాబోయ్.. అనేలా దిగజార్చారు. సిరంజిలు, పారాసిటమాల్ మాత్రలు సైతం ఆస్పత్రిలో లేక బయట కొనుగోలు చేయాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ యంత్రం నిర్వహణను అటకెక్కించి, మూలన పడేశారు.

మళ్లీ పూర్వ వైభవం

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో హిందూపురం ఆస్పత్రికి మళ్లీ పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, బాలయ్య ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టడంతో ఆస్పత్రి అభివృద్ధి పరుగులు పెడుతుందని పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో అధునాతన సీటీ స్కానింగ్ యంత్రం అందుబాటులోకి రానుంది. దీంతో ప్రజలు రూ.వేల రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన అవసరం ఉండదు.

నేడు వైద్యులతో సమావేశం



హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే గృహంలో వైద్యులతో ఆదివారం సమావేశం నిర్వహించనున్నారు. దీంతో ఆస్పత్రి అభివృద్ధికి వడివడిగా అడుగులు పడతాయని హర్షం వ్యక్తమవుతోంది.

వైసీపీ నాయకుడి దర్జా..!



వైసీపీ నాయకుడు కబ్జాచేసిన స్థలం



వద్దే రమణమ్మకు ఇచ్చిన పట్టా

పేదల ఇళ్ల స్థలాలు దౌర్జన్యంగా ఆక్రమణ

- పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి కూడా..
- మొత్తం 40 సెంట్లు.. విలువ రూ.కోటి..
- అండగా నిలిచిన వీఆర్వో
- బాధితులు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని అధికారులు

కొత్తచెరువు, జూలై 13: గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల కబ్జాలకు పరాకాష్ఠ ఇది. వైసీపీ నాయకుడి భార్య పేరుమీద ప్రభుత్వం రెండు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసింది. అక్కడే మరో 9 మందికి పట్టాలిచ్చారు. గత వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ పార్టీ నాయకుడు దౌర్జన్యానికి దిగాడు. మిగతా 9 మందికి పట్టాలిచ్చిన స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. దీంతో మొత్తం 20 సెంట్లు కైవసం చేసుకున్నాడు. పక్కనే ఉన్న 20 సెంట్ల ప్రభుత్వ భూమిని కలిపేస్తున్నాడు. మొత్తంగా 40 సెంట్ల స్థలాన్ని ఆధీనంలో ఉంచుకున్నాడు. అక్కడ సెంటు భూమి రూ.2 లక్షలకు పైమాటే. ఈ లెక్కన దాదాపు రూ.కోటి విలువచేసే భూమిని వైసీపీ నాయకుడు దర్జాగా కబ్జా చేశాడన్న మాట.

2 నుంచి 40 సెంట్లకు..

కొత్తచెరువు మండలంలోని కొడపగానిపల్లిలో ధర్మవరం ప్రధాన రహదారి పక్కన గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా 341 సర్వే నంబరులో ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 2017లో పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. అందులో భాగంగా వైసీపీ నాయకుడు తంగం రవికుమార్ భార్య శోభ పేరు మీద రెండు సెంట్ల స్థలం ఇచ్చారు. అక్కడే పేదలైన వడ్డే రాధమ్మ, వడ్డే రమణమ్మ, వడ్డే కిష్టప్ప, మరో ఆరుగురికి రెండు సెంట్లు చొప్పున పట్టాలిచ్చారు. వీరు పునాదులు వేసుకున్నారు. ఇళ్లు కట్టుకోవడానికి స్తోమత లేకపోవడంతో కిష్టప్ప ఒక్కడే పూరిగుడిసె వేసుకున్నాడు. అక్కడే నివాసం ఉండేవాడు. గాలివానకు ఆ గుడిసె పడిపోవడంతో గ్రామంలో ఆర్డీటీ కట్టించిన ఇంట్లోకి వెళ్లాడు. దీనిని గమనించిన వైసీపీ నాయకుడు తంగం రవికుమార్ తన భార్య పేరున మంజూరైన స్థలం పక్కనే కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ వెళ్లాడు. అలా ఏకంగా.. 5 సెంట్ల స్థలంలో ఇల్లు, రేకుల షెడ్ నిర్మించాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై సర్వే చేసిన రెవెన్యూ అధికారులు.. వైసీపీ నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం 2 సెంట్లు ఇస్తే.. పక్క స్థలాలను ఎలా ఆక్రమిస్తావంటూ ప్రశ్నించారు. అప్పట్లో అధికారంలో వైసీపీ ఉండడంతో ఆ పార్టీ స్థానిక నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి, సమస్యను అటకెక్కించారు. ఇక కబ్జాను విస్తరించుకుంటూ పోయాడు. పక్కనే పేదలకు ఇచ్చిన 18 సెంట్లను ఆక్రమించుకున్నాడు. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి 20 సెంట్లను కలిపేసుకున్నాడు. మొత్తంగా 40 సెంట్ల స్థలానికి చుట్టూ సిమెంటు స్తంభాలను పాతి, కంచె సైతం వేసుకున్నాడు. దీనిపై బాధితులు.. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. స్థానిక వీఆర్వో.. వైసీపీ నాయకుడు రవికుమార్‌కు బంధువు కావడంతో బాధితులపైనే చిందులు తొక్కారు. తమకు 2017లో మంజూరు చేసిన పట్టాలున్నాయని పలుమార్లు వీఆర్వోకు అర్జీలు ఇచ్చినా తమకు న్యాయం చేయలేదని బాధితులు వాపోతున్నారు. దీనిపై పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖకు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు తహసీల్దార్ కళావతి మండల సర్వేయర్‌తో సర్వే చేయించారు. బాధితులకు రెండు సెంట్లు చొప్పున స్థలాన్నిచూపించారు. అధికార పార్టీ అండదండలతో రవికుమార్ వారిపై అక్రమ కేసులు బనాయించి, ఇబ్బందులు పెట్టినట్లు బాధితులు ఆవేదన చెందుతున్నారు. వైసీపీ హయాంలో రవికుమార్ రెచ్చిపోయాడు. 'ప్రభుత్వం మాది అనీ, మీరు టీడీపీ సానుభూతిపరులు ఏం చేసుకుంటరో చేసుకోండి' అంటూ అప్పట్లో బెదిరించినట్లు బాధితులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తమకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని ఇప్పించాలని వారు కోరుతున్నారు.

సర్వే చేయించి.. హద్దులు చూపించాం..

బాధితుల ఫిర్యాదు మేరకు సర్వే చేయించాం. పట్టాలు పొందిన వారికి హద్దులు కూడా చూపించాం. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

-కళావతి, తహసీల్దార్, కొత్తచెరువు

కరువు సీమలో ప్రాజెక్టులు పూర్తి చేయడమే టీడీపీ లక్ష్యం

ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్, జూలై 13: కరువు సీమలో ప్రాజెక్టులు పూర్తి చేయడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. రాయలసీమ ప్రజాసంఘాలు, సాహిత్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని సింగమనేని సభాప్రాంగణంలో శనివారం నిర్వహించిన కథ కార్యశాలకు ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత దివంగత రచయితలు సింగమనేని నారాయణ, చిలుకూరి దేవపుత్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పూర్తి నిర్లక్ష్యానికి గురైందన్నారు. పరిశ్రమలు స్థాపించడం, పెట్టుబడులు రాబట్టడం, ఉపాధి అవకాశాలు ఇలా అన్ని రంగాల్లోనూ జిల్లా వెనుకబడిపోయిందన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమకు నీరందించడంలో టీడీపీ కృషి చేసిందన్నారు. గత పదేళ్లనుంచి హంద్రీనీవా రావడం వల్ల కొంత ప్రయోజనం కలిగిందన్నారు. ప్రస్తుతం హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా కాలువ వెడల్పు వంటి పనులు చేయాల్సివుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, జూటూరు షరీఫ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సరిపూటి రమణ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, బీసీ సెల్ నాయకుడు జోగి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాయి బోధనలే శిరోధార్యం

యువ సదస్సులో వక్తలు.. అలరించిన సంగీతకచేరి

నేడు సత్యసాయి క్రికెట్ లీగ్‌పోటీలు



సంగీత కచేరి నిర్వహిస్తున్న బొడెల్‌బృందం

పుట్టపర్తి, జూలై 13 : సత్యసాయిబాబా ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలే తమకు శిరోధార్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. రెండోరోజు శనివారం ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో సత్యసాయి గ్లోబల్ యంగ్ అడాల్ట్ సదస్సు కొనసాగింది. దేశవిదేశాలకు చెందిన వక్తలు ప్రసంగించారు. ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలు, మానవాళికి అందిస్తున్న వెలకట్టలేని సేవలతో బాబా ఆధ్మాత్మిక గురువుగా పూజలు అందుకుంటున్నారన్నారు. ప్రశాంతినిలయం వేదికగా ప్రపంచానికి శాంతిసందేశాన్ని అందించారని వివరించారు. సత్యసాయి బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు ముందుకెళుతున్నామని అన్నారు. మానవసేవయే మాధవసేవ అన్న సత్యంతో సామాజిక సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్య, విలువలు, కలిగి ఉండి సామాజిక సేవాస్పృహతో జీవనం సాగించాలని సూచించారు. సాయంత్రం సాయి కుల్వంత్ సభామండపంలో బొడెల్‌బృందం సంగీతగాన కచేరి నిర్వహించారు. గంటపాటు మధురగానంతో భక్తులను అలరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఆదివారం యువసదస్సు కొనసాగనుంది.

నేడు సత్యసాయి యూనిట్ కప్

సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం హిల్‌వ్యూస్టేడియంలో భారత్ లెవన్, గ్లోబల్‌లెవన్ జట్లమధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. మాజీ క్రికెటర్ మురళీకార్తీక్, ట్రస్టుసభ్యులు కలసి క్రికెట్‌లీగ్ పోటీలను ప్రారంభిస్తారు.

తపాలా కార్యాలయంలో గోల్‌మాల్

లబోదిబోమంటున్న ఖాతాదారులు



విచారిస్తున్న అధికారులు

నల్లమాడ, జూలై 13: తపాల కార్యాలయంలో దాచుకున్న డబ్బులు గోల్‌మాల్ కావడంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. ఏకంగా రూ. 20 లక్షల వరకు అవినీతి జరిగినట్లు ఖాతాదారులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో పలువురు డిపాజిట్లు, ఆర్డీలు చేసుకున్నారు. ఇందులో కాలపరిమితి అయిన వారు డబ్బుల కోసం తపాలా కార్యాలయ అధికారి వద్దకు వెళ్లారు. ఆయన వారితో సంతకాలు చేయించుకొని కొద్ది రోజుల తర్వాత డబ్బులు మీకు అందజేస్తామని చెప్పినట్లు ఖాతాదారులు తెలిపారు. ఇలా పలుమార్లు తిప్పుకున్నాడనిగానీ డబ్బులు అందజేయలేదన్నారు. దీంతో తపాలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, వారు నల్లమాడ కేంద్రానికి చేరుకుని తనిఖీ చేశారు. అయితే తనిఖీ వివరాలు వెల్లడించకుండ గోప్యంగా ఉంచుతున్నారు. దీంతో ఖాతాదారులు ఆందోళన చెంది నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం ఉన్నతాధికారులు శనివారం మండలకేంద్రానికి వచ్చి విచారణ చేశారు. ఎంత అవినీతి జరిగిందనేది ఇంత వరకు బయటకు రాలేదు. దాదాపుగా రూ.20 లక్షలు వరకు అవినీతి జరిగినట్లు ఖాతాదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల విచారణలో వాస్తవాలను ఎప్పుడు బయటకు చెబుతారనేది వేచిచూడాల్సి ఉంది.

రెండేళ్లలో రైల్వేలైన్ పూర్తి చేస్తాం

రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ పనుల పరిశీలన

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

నీటి సమస్యలపై డీపీఆర్ తయారు చేయండి

రైల్వే, జలవనరుల సహాయ మంత్రి మంత్రి సోమణ్ణ

మడకశిర, జూలై 13: రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ నిర్మాణ పనులు 2026 డిసెంబరులోపు పూర్తి చేయడమే లక్ష్యమని రైల్వే, జలవనరుల సహాయ మంత్రి సోమణ్ణ పేర్కొన్నారు. మడకశిర సమీపంలో జరుగుతున్న రైల్వేలైన్ నిర్మాణ పనులను శనివారం ఆయన ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రాయదుర్గం-తుమకూరు, మడకశిర మీదుగా జరుగుతున్న రైల్వే పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. రైల్వేలైన్ నిర్మాణ పనుల వల్ల ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అండగా ఉంటామన్నారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారుల ను ఆదేశించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, జలశక్తి మిషన్ నుంచి నిధులు మంజూరు చేయించి ప్రజల దాహార్తి తీర్చాలని కేంద్రమంత్రిని కోరారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో చెరువుల మరమ్మతులు, చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.500 కోట్ల నిధులు అవసరమవుతాయని, వాటిని మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి డీపీఆర్ తయారు చేసి పంపాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే రింగ్‌రోడ్డు, రైల్వేలైన్ నిర్మాణం ఆగిందని, వెంటనే పూర్తి చేసేందుకు కేంద్రమంత్రి సహకారం కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



రైల్వేలైన్ పనులను పరిశీలించేందుకు వెళ్తున్న కేంద్ర మంత్రి

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

మడకశిరటౌన్: రైల్వేలైన్ నిర్మాణ పనులను పరిశీలించడానికి శనివారం మడకశిరకు వచ్చిన రైల్వే, జలజీవన్ శాఖ సహాయ మంత్రి వి.సోమణ్ణకు ఘన స్వాగంతం లభించింది. ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గం అభివృద్ధి పట్ల చర్చించారు. నియోజకవర్గంలో సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు సైతం పాల్గొని గజమాలతో సత్కరించారు. ఈప్రాంతం అభివృద్ధి పట్ల వినతులు అందించారు.

ముందుచూపున్న నాయకుడు చంద్రబాబు

: కేంద్ర మంత్రి సోమణ్ణ

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పట్ల ముందు చూపున్న గొప్ప వ్యక్తి అని కేంద్రమంత్రి సోమణ్ణ అన్నారు. శనివారం మడకశిరలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇద్దరి నాయకత్వంలో దేశం, రాష్ట్రం ప్రగతి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువుల మరమ్మతుల కోసం ఒక ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వక్కలిగలు, లింగాయతు, సాదర కులస్తులను ఓబీసీలోకి చేర్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ సాధికార కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, కర్ణాటక ప్రాంతానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నియోజకవర్గ నాయకులు

రైల్వే పనుల పరిశీలన

పావగడ: ఆంధ్రప్రదేశ్‌లోని రాయదుర్గం నుంచి కర్ణాటకలోని తుమకూరు వరకు 207కి.మీ. రైల్వే లైన్ నిర్మాణ పనులను కేంద్ర రైల్వేశాఖ, కేంద్ర జనవనరుల సహాయశాఖ మంత్రి సోమణ్ణ పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 63కి.మీ. పనులు పూర్తయ్యి రైలురాకపోకలు జరుగుతుండగా కర్ణాటకలో ఇంకా భూసేకరణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను మంత్రి హెచ్చరించారు.

జనసంద్రంగా గూగూడు

దర్శనం కోసం రెండు కిలో మీటర్లు క్యూకట్టిన భక్తులు

ఇబ్బందులు పడిన మహిళలు, చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో గూగూడు కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల, జూలై 13: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయిస్వామి నిత్య పూజ నివేదిన శనివారం జనసంద్రంగా మారింది. రెండవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు గూగూడుకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి దాదాపు రెండు కిలో మీటర్ల మేర క్యూలైన్‌లో భక్తులు నిలబడి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, కుళ్లాయిస్వామికి చక్కెర చదివింపులు చేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు వారిని అదుపుచేయలేక నానా అవస్థలు పడ్డారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భక్తులకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీరు అందజేశారు.



అగ్నిగుండం ముందు భక్తజనం

నేడు చిన్న సరిగెత్తు

గూగూడు కుళ్లాయిస్వామి చిన్న సరిగెత్తు ఆదివారం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. 15న నిత్య నివేదిన పూజ, 16న పెద్దసరిగెత్తు, 17న అగ్నిగుండం ప్రవేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శోభ, గ్రామ పెద్దలు జాఫర్‌వలి, రాజన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ హాల్ టిక్కెట్ల జారీలో జాప్యం

30వ తేదీకి మారిన పరీక్షలు

కాపీయింగ్‌కు రూ.4 వేల చొప్పున వసూలు

గుంతకల్లు, జూలై 13: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) విద్యార్థులకు హాల్ టిక్కెట్ల జారీలో సాంకేతిక లోపం ఏర్పడిన కారణంగా పరీక్షలు పదిహేను రోజులు వాయిదాపడ్డాయి. ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించాల్సిన పరీక్షలు ఆగస్టు 1వ తేదీకి మారాయి. సాంకేతిక సమస్య కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మందికి హాల్ టిక్కెట్లు జనరేట్ కాలేదని సమాచారం. ఈ కారణంగా పరీక్షలను 15 రోజులు ఆలస్యంగా నిర్వహించడానికి నిర్ణయించారు. కాగా ఐటీఐ పరీక్షలకు ఇంకా ఎగ్జామినేషన్ సెంటర్లను ఖరారుచేయలేదు. ఈనెల 24వ తేదీ లోపు విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లను చేర్చి ఆగస్టు 1వ తేదీ నుంచి పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు రాయదలచిన విద్యార్థులకు ఈనెల 10వ తేదీ వరకూ ఫీజు కట్టే అవకాశం ఉండగా, సప్లిమెంటరీ విద్యార్థుల సౌలభ్యం కోసం 15వ తేదీ వరకూ గడువును పొడిగించారు.

విద్యార్థుల నుంచి డబ్బు వసూలు

పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిపించడానికి ఐటీఐల నిర్వాహకులు విద్యార్థుల నుంచి రూ. 4 వేలు వసూలు చేస్తున్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి ఐటీఐలలో దాదాపు 900 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గుత్తిలో ఒకటి, కొనకొండ్లలో ఒకటి, గుంతకల్లులో ప్రభుత్వ ఐటీఐతో కలిపి ఐదు ఐటీఐలు ఉన్నాయి. గుత్తిలో ఒకే కళాశాల ఉండటంతో అందులోని విద్యార్థులకు అనంతపురం సెంటరు లభిస్తోంది. గుంతకల్లులో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు అదే విద్యా సంస్థలో పరీక్షలు రాస్తారు.

కానీ మిగతా నాలుగు ఐటీఐలు ఎగ్జామ్ సెంటరుగా కొనకొండ్ల ఐటీఐ వచ్చేలా పైరవీలు చేస్తున్నారు. గతంలో ప్రైవేటు ఐటీఐల విద్యార్థులకు ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో నిర్వహించేవారు. అక్కడ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకపోవడంతో గత పదేళ్లుగా కొనకొండ్ల ఐటీఐలో పరీక్షలు నిర్వహించేలా మేనేజ్ చేస్తున్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిపించడం కోసం, కావాల్సిన ఎగ్జామ్ సెంటరు వచ్చేలా చేయడం కోసం అధికారులకు డబ్బు ఎరచూపడానికి విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి రూ.4 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. కాపీయింగ్‌తో పాస్ కావచ్చన్న కారణంగా విద్యార్థులు సాంకేతిక విద్యను సక్రమంగా అభ్యసించడం లేదు. చివరకు ప్రాక్టికల్స్‌లో కీలకంగా ఉన్న డ్రాయింగ్ పరీక్షలో కూడా ఇతరుల చేత చిత్రాలను వేయించి పాస్ చేయించాల్సిన దుస్థితి పట్టింది. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తేతప్ప విద్యార్థులకు సాంకేతిక విద్యను ఒంటబట్టే అవకాశాలు లేవు. పరీక్షలను ఊరికి దూరంగా ఉన్న ప్రైవేటు విద్యా సంస్థ వెంకటేశ్వర ఐటీఐలో నిర్వహించకుండా ఎస్కేపీ కళాశాలలో నిర్వహించాల్సిన అవసరం ఉంది.

మామిడితోటలో గంజాయి మొక్కలు



మామిడి తోటలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు, సిబ్బంది

రాయదుర్గం రూరల్, జూలై 13: మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలోని ఓ మామిడి తోటలో గంజాయి సాగు చేస్తున్నట్లు సెబ్ అధికారులు గుర్తించారు. రైతు సందీప్ కుమార్ తోటలో కాపలాదారు వన్నూరుస్వామి రహస్యంగా వీటిని పెంచుతున్నట్లు గుర్తించామని సెబ్ ఏఎస్పీ రామకృష్ణ శనివారం తెలిపారు. సందీప్‌కుమార్ తొమ్మిది ఎకరాలలో మామిడిచెట్లు సాగుచేశాడని, ఈ తోటకు తొమ్మిది నెలల నుంచి వన్నూరుస్వామి కాపలాదారుగా ఉన్నాడని తెలిపారు. మామిడి చెట్ల మధ్యలో బంతిపూలు, కనకంబరాలను సాగు చేశారని, వాటి మధ్యలో వన్నూరుస్వామి నాలుగు గంజాయి మొక్కలను రహస్యంగా పెంచాడని తెలిపారు. సెబ్ విభాగం డీటీఎఫ్ సీఐ వెంకటలక్ష్మికి సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని తెలిపారు. తోటలో పెంచిన నాలుగు గంజాయి మొక్కలను తొలగించి, సీజ్ చేశామని అన్నారు. వాటి బరువు 7.25 కిలోలు ఉందని, విలువ రూ.21 వేలు ఉంటుందని తెలిపారు. వన్నూరుస్వామిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ మారాలి: శైలజానాథ్



మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, జూలై 13: బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌లో మార్పు రావాల్సిన అవసరం ఉందని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. డీసీపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా బీజేపీలో మార్పు రాలేదని అన్నారు. రాజ్యాంగ హత్యా దినం అనడం బాధాకరమని అన్నారు. 'మీరు 400 సీట్లు అడిగితే ప్రజలు మిమ్మల్ని మైనార్టీలో నిలబెట్టారు. మీ పరిస్థితి ఏమిటో దీన్ని బట్టే అర్థమౌతోంది.' అని విమర్శించారు. ఏపీ పొత్తు లేదంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లేదని అన్నారు. అలాంటి ఏపీకి ఏమి చేశారని మండిపడ్డారు. బీజేపీ క్రూరమైన ఆలోచనా విధానాల్లో ఏ మాత్రం మార్పు లేదని అన్నారు. నోట్లు రద్దు చేసి.. లక్ష అబద్ధాలు చెప్పి- ధనవంతులకు ఎలా ఉపయోగపడ్డారో అందరికీ తెలుసని అన్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగి ప్రజలు ఎంతో మంది చనిపోయారని, ఆ హత్యలన్నీ బీజేపీ ఖాతాలోకే వస్తాయని అన్నారు. మణిపూర్‌లో అంత దారణ పరిస్థితి ఎర్పడితే.. ఇప్పటికీ ప్రధాని అక్కడికి పోలేదని విమర్శించారు. రాహుల్ గాంధీ ఇప్పటికే ఒక సారి వెళ్లి వచ్చారని, మరోసారి వెళ్లాలని చూస్తే అడ్డుకున్నారని అన్నారు. 'మా ప్రాంతానికి ఇచ్చిన మాటను మీరు తప్పారు. ఆ రోజును విశ్వాసఘాతుక దినం అని మేము ప్రకటించవచ్చా..?' అని నిలదీశారు. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పింది ఏమిటి..? మీరు చేసింది ఏమిటి అని నిలదీశారు.

తలుపు తీయండ్రా బాబూ..!

కుక్క భలే దర్జాగా కుర్చీలో కూర్చుంది..! ఎవరిదో..! అనుకుంటున్నారా..? దర్జా లేదూ.. పాడూ లేదు..! పాపం వీధి కుక్క అది. గాండ్లపెంట మండలం సోమయాజులపల్లి గ్రామ స చివాలయంలోని అలవాటు ప్రకారం శుక్రవారం వెళ్లింది. సా యంత్రం వరకూ సిబ్బందితో కలిసి అక్కడే విధులు నిర్వర్తించి.. అలసిపోయి నిద్రించినట్లుంది. దాన్ని చూడకుండా సచివాలయ సిబ్బంది తాళం వేసుకుని వెళ్లిపోయారు. ఏం చేయాలో ది క్కుతోచక రాత్రంతా అక్కడే గడిపింది. మధ్య మధ్యలో భౌ..భౌ మని మొత్తుకుంది. రాత్రంతా దాని గోల భరించిన స్థానికులు.. శనివారం ఉదయం అక్కడికి వెళ్లి చూశారు. కుర్చీపై కుక్క ఇలా దర్జాగా కూర్చుని కనిపించింది. ఫొటో తీసి.. సచివాలయ సిబ్బందికి పంపించారు. 'ఇదీ.. మీ నిర్వాకం..' అన్నట్లుగా..! 'ఎవరో ఒకరు వచ్చి తలుపులు తీస్తాంలే..' అని చెప్పారట. రెండో



శనివారం సెలవు.. ఆదివారం సెలవు..! ఎవరూ రాకపోయుంటే.. దానిది కుక్క చావే..! ఇంకొక్కసారి సచివాలయం లోపలికి అడుగు పెట్టదనకుంటా..!

- గాండ్లపెంట

టీబీ డ్యాంలో 30 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్, జూలై 13: తుంగభద్ర జలాశయం 30.690 టీఎంసీలు చేరాయి. శనివారం నాటికి 18,060 క్యూసెక్కులకు చేరింది. వారంరోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చు తగ్గుదల మధ్య కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీలకు గాను 30.690 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉన్నాయి. అవుట్ ఫ్లో 210 కూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1606.21 అడుగుల వరకు నీరు చేరాయి. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గుతోంది.

తగ్గిన చీనీ ధరలు

అనంతపురంరూరల్, జూలై 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో చీనీధరలు తగ్గాయి. గత కొన్నిరోజులుగా స్థిరంగా పలుకుతున్న ధరలు శనివారం తగ్గాయి. శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 753టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.48

అనంతపురం రూరల్, జూలై 13: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 80టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.42, కనిష్ఠ ధర రూ.33 పలికినట్లు ఆయన తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, జూలై 13: పాలిటెక్నిక్ కోర్సుల ద్వితీయ సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని 18న స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో పాటు హాజరు కావాలని కోరారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లుటౌన్, జూలై 13: పట్టణంలోని రైల్వే క్రీడా మైదానంలో సోమవారం జిల్లా కబడ్డీ మహిళలు, పురుషుల జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులో ఆగస్టు 2,3,4 తేదీలో పాముజూల శ్రీనివాసులు, మహాలక్ష్మి మెమోరియల్ 11వ ఆంధ్రరాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు సంబంధించి మహిళలు 75కేజీల విభాగం, పురుషులు 85కేజీల విభాగంలో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామ సచివాలయ ఇంజినీర్ల జిల్లా కమిటీ ఎంపిక



గ్రామ సచివాలయ ఇంజినీర్ల సంఘం సభ్యులు

బుక్కపట్నం, జూలై 13: సెక్రటేరియట్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్ల కమిటిని ఏక గ్రీవంగా ఎంపిక చేశారు. బుక్కపట్నం గ్రామ సచివాలయంలో శనివారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా స్థాయి సెక్రటేరియట్ ఇంజినీర్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ (ధర్మవరం మండలం), ప్రధాన కార్యదర్శిగా విజయ్‌చౌదరి (చిలమత్తూరు మండలం), కోశాధికారిగా సుదర్శన్ (నల్లమాడ)తోపాటు 13మందిని సభ్యులుగా ఎంపికచేశారు.

బీసీ న్యాయవాదుల జిల్లా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేశ్

ధర్మవరం, జూలై 13: బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అడ్ హాక్ కమిటీని సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేశ్ ఆధ్వర్యంలో ఏక గ్రీవంగా ఎంపికచేశారు. పట్టణంలోని ఎన్జీఓహోంలో శనివారం బీసీ న్యాయవాదుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ స మావేశంలో జిల్లా అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షు లుగా సీనియర్ న్యాయవాదులు జీసీ నల్లప్ప, కృష్ణమోహన్, అ ధ్యక్షుడిగా మేకల రామాంజినేయులు, ప్రధానకార్యదర్శిగా అశోక్ కుమార్‌ను ఎంపిక చేశారు. మిగిలిన సభ్యులను త్వరలో ప్రకటి స్తామని సాకే నరేశ్ తెలిపారు.ఈ సమావేశంలో న్యాయవాదులు బన్నిలా మహేశ్, కిశోర్‌కుమార్, బిల్లేరవి, సాకే రామాంజి నేయులు, బాబు, బిల్లే నరేంద్ర పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

- 15 తులాల బంగారం రికవరీ



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆరోహణరావు

బత్తలపల్లి, జూలై 13: పట్ట పగలే ఎవరూలేని సమయంలో ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడే ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ ఆరోహణరావు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం విలేకరులకు వెల్లడించారు. ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన షేక్ ఖాజా పీరా చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. వాటితో పాటు కుటుంబ పోషణ కోసం దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. గత నెల 21న మండలకేంద్రమైన బత్తలపల్లిలోని వినాయక నగర్‌లో మల్లెల రామాంజినేయులు ఇంటికి తాళం వేయకుండా స్నా నానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేరని గమనించిన ఖాజా పీరా ఆ ఇంట్లోకి చొరబడి బీరువాను బద్దలు కొట్టి అందులోని బంగారు ఆభరణాలు ఎత్తికెళ్లాడు. కొంతసేపటికి తిరిగి వచ్చిన రామాంజినేయులు భార్య జ్యోతి దొంగతనం జరిగిందని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా చిలమత్తూరు మండలం మరవ కొత్తపల్లిలోనూ ఇదే తరహాలో దొంగతనం చేశాడు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టీం గాలింపుచర్యలు చేపట్టింది. బత్తలపల్లిలోని అన్నపూర్ణ డాబా వద్ద ఖాజా పీరాను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 15 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. తమ బంగారం నగలను రికవరీ చేయడంతో మల్లెల రామాంజినేయులు సీఐ ఆరోహణరావు,ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని సన్మానించారు.

గాలివానకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

అంబేడ్కర్‌నగర్‌కు ఆగిన విద్యుత్ సరఫరా



పాక్షికంగా దెబ్బతిన్న విద్యుత్తు స్తంభం

నంబులపూలకుంట, జూలై 13: మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం శుక్రవారం రాత్రి గాలివానకు దెబ్బతింది. విద్యు త్ స్తంభానికి అనుకుని చెట్టు ఏపు గా పెరిగిఉంది. ఎక్కువ గాలి వీచ డంతో ఆ చెట్టు తాకిడికి విద్యుత్ స్తంభం పాక్షికంగా దెబ్బతింది. దీంతో గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా శుక్రవారం రాత్రి కాలనీ అంతా చీకటి మయం అయింది. విద్యుత్ అధికారులు శనివారం విద్యుత్ అంతరాయం లేకుండా చేశారు. కానీ విద్యుత్ స్తంభాన్ని మాత్రం మార్చలేదు. విద్యుత్ స్తంభం మరమ్మతులు చేపట్టకపోతే ప్రమాదం పొంచి ఉందని కాలనీ వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని 13 పొట్టేళ్ల మృతి

గుత్తి రూరల్, జూలై 13: మండలంలోని శ్రీపురం గ్రామశివారులో 67వ జాతీయ రహదారిపై శనివారం లారీ ఢీ కొని 15 పొట్టేళ్లు మృతి చెందాయి. మరో పది పొట్టేళ్లకు గాయాలయ్యాయి. శ్రీపురానికి చెందిన రైతు పాపన్నకు 102 పొట్టేళ్లు ఉన్నాయి. ఉదయం గ్రామశివారులోకి మేత కోసం తీసుకెళ్తుండగా.. రోడ్డులో లారీ వేగంగా వచ్చి వాటిపై దూసుకెళ్లింది. దీంతో 15 పొట్టేళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 జీవాలు కాళ్లు, నడుములు విరికి అక్కడే పడి పోయాయి. స్థానికులు లారీని నిలబెట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బాధిత రైతు మాట్లడుతూ రూ.4లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

చిరువ్యాపారి ఆత్మహత్య

ఉరవకొండ, జూలై 13: పట్టణంలోని రాయంపల్లి రహదారిలో ఉన్న జగనన్న కాలనీలో నివాసముంటున్న మల్లికార్జున(52) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన స్థానిక పాత బస్టాండ్ సమీపంలో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇంటి నిర్మాణం, వ్యాపారం కోసం రూ.10లక్షలు దాకా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక శనివారం తీవ్ర మనస్థాపానికి గురై డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న పాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే వచ్చి పరిశీలించి అతను అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

ఒకరి మృతి... ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నల్లచెరువు, జూలై 13: మండల పరిధిలోని ఎన్‌హెచ్ 42పై ఎర్రగుట్లపల్లి వద్ద చెట్టుకు కారు ఢీ కొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా ఉప్పరపల్లికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి(41) కుటుంబసభ్యులతో శనివారం ఉదయం కారులో తిరుపతికి వెళుతున్నాడు. నల్లచెరువు సమీపంలో ఎర్రగుంట్లపల్లి వద్ద కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో అయిదుగురు ఉండగా ముగ్గురికి తీవ్రగాయాలు కాగా ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి విషయంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మిగిలిన ఇద్దరిని కదిరి ప్రభుత్వాసుపత్రిలో చేర్పినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

- దాదాపు 30 సెంట్ల స్థలం విలువ రూ.కోటిపైనే...
- పునాదులు వేసి, ఇళ్ల నిర్మాణం



ప్రభుత్వ స్థలంలో వేసిన పునాదులు

కదిరి, జూలై 13: మండలంలోని ముత్యాల చెరువు పొలంలో... కదిరి పట్టణశివార్లలో ఉన్న టిడ్కో ఇళ్లకు సమీపంలో ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీకి పక్కనే ఉన్న ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పునాదులు వేశారు. దాదాపు 30 సెంట్లకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని, దీని విలువ దాదాపు రూ. కోటికి పైగా ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. కదిరి పట్టణ శివారు ప్రాంతంలో హిందుపురం రోడ్డుకు సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్ల పక్కన అర్ అండ్ అర్ కాలనీ ఉంది. దానికి ఆనుకుని దాదాపు 10 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. అందులో ఎక్కువగా కొండలు, గుట్టలు ఉన్నాయి. అర్ అండ్ అర్ కాలనీలో ఇప్పటికే పలువురికి పట్టాలు ఇచ్చారు. దాని పక్కన చదునైన స్థలం దాదాపు మూడు ఎకరాలకు పైగా ఉంటుంది. అందులో దాదాపు 30 సెంట్లకు పైగా స్థలాన్ని కదిరికి చెందిన కొంతమంది కబ్జా చేసి ఇళ్ల నిర్మాణానికి పునాదులు వేశారు. ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం దాదాపు పదికి పైగా ఇళ్లు వెలుస్తున్నాయి. ఇక్కడ మార్కెట్ ధర ప్రకారం సెంట్ స్థలం విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంది. ఆక్రమణదారులు మొత్తం అక్రమించుకున్న స్థలం విలువ దాదాపు రూ. కోటి పైగా ఉంటుందని రియల్ ఏస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కూత వేటు దూరంలోనే అర్‌డీఓ కార్యాలయం ఉంది. అయినా యథేచ్ఛగా కబ్జాలు కొనసాగుతున్నాయి. ఒక పక్క కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పట్టణంలో కబ్జాలను తొలిగిస్తుంటే, మరో పక్క కోట్ల రూపాయల విలువ చేసే భూముల కబ్జాకు పలువురు పాల్పడడం చర్చనీయంగా మారింది. దీనిపై స్థానిక తహసీల్దార్ పుల్లారెడ్డిని వివరణ కోరగా... అర్ అండ్ అర్ కాలనీలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అక్కడి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకుంటే వాటిని తొలగిస్తామ న్నారు. కబ్జాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు.

మొహరం వేడుకలు ప్రారంభం

తాడిమర్రి, జూలై 13: మండలకేంద్రంలో మొహరం ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి పీర్ల పెట్టెను ఊరేగించి శనివారం ఉదయం పీర్లను భక్తుల దర్శనం కోసం చావిడిలో కొలువుదీర్చారు. సాయంత్రం అగ్ని గుండాన్ని వెలిగించారు. మూడు రోజుల పాటు అగ్ని గుండాన్ని బాగా వెలిగించి ఉత్సవాలు ఘనంగా నిర్వహి స్తారు. బుధవారం సాయంత్రం పీర్ల అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తామని ముజావర్ హుస్సేన్‌షా తెలిపారు. కాగా రోడ్డు విస్తరణలో పీర్లచావిడిని కూల్చివేయగా వారం రోజుల క్రితమే పునరుద్ధరించారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని గాండ్లవారిపల్లిలో పీర్లను శనివారం కొలువుదీర్చారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ నెల 16న చిన్న సరిగెత్తు, 18న పెద్ద సరిగెత్తు, 19న జలధి కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.



తాడిమర్రిలో కొలువు దీరినపీర్లు



గాండ్లవారిపల్లిలో...

'లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు'

ధర్మవరం, జూలై 13: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎవరూ వాహనాలు నడపరాదని న్యాయవాది బాలసుందరి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం మోటార్ వెహికల్ యాక్ట్‌కు సంబంధించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ... కొత్తగా ఏర్పడిన చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా డ్రైవింగ్‌లైసెన్స్ లేనివారు, మైనర్లు వాహనాలను నడపకూడదన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, హెడ్‌కానిస్టేబుల్ నాగపవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కుళ్లాయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ..
ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె, జూలై 13: మండలంలోని పెనకచెర్ల డ్యాం సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలు ముగ్గురు గాయపడ్డారు. అంకంపేట గ్రామానికి చెందిన ఓబిరెడ్డి, భార్య సువర్ణమ్మ పెన్నహోబిలం నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తున్నారు. పెనకచెర్ల డ్యాంకు చెందిన భార్గవ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో గ్రామం నుంచి డ్యాం వైపు వెలుతున్నాడు. డ్యాం సమీపంలోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

సచివాలయం కిటికీలు ధ్వంసం



ధ్వంసమైన కిటికీలు

గుత్తి రూరల్, జూలై 13: మండలంలోని శ్రీపురం గ్రామాశివారులో నూతనంగా నిర్మించిన సచివాలయ కిటికీలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత ప్రభుత్వంలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించారు. సచివాలయం ప్రారంభనికి నోచ్చుకొలేదు. ఈ సచివాలయానికి మొత్తం 12 కిటికీలు, 12 డిజైన్ వెంటిలేటర్స్ గ్లాసులతో ఉన్నాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు 9,కిటికిలు, 10 డిజైన్ వెంటిలేటర్స్‌కు ఉన్న గ్లాసులను రాళ్లతో ధ్వంసం చేశారు. రూ.లక్ష నష్టం వాటిలినట్లు అధికారులు తెలిపారు. గ్రామస్థులు, సర్పంచు లింగమయ్య, సచివాలయా సిబ్బంది, కలసి గుత్తి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: ఎస్ఐ

ధర్మవరంరూరల్, జూలై13: గ్రామాల్లో మొహరం వేడుకల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ నరేంద్ర హెచ్చరించారు. మొహర్రం వేడుకల సందర్భంగా శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పలు గ్రామాల ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ మొహరం వేడుకల్లో గ్రామాల్లో అల్లర్లు సృష్టించి, గొడవలకు పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో జరిగిన గొడవలకు దారితీసిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామం పైన నిఘా ఉంచామన్నారు. ప్రతి గ్రామంలో బందోబస్తు నిర్వహి స్తున్నామని తెలిపారు. మద్యం తాగి ఇష్టారాజ్యంగా వ్యహరించి గొడవలకు దారితీసి ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేసి బైండోవర్‌లు చేస్తామన్నారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నప్పుడు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న భైరవప్రసాద్

గాండ్లపెంట, జూలై 13: కార్యకర్తలకు జనసేనపార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని రెక్కమాను గ్రామంలో శనివారం నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలలో కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు. మండల వ్యాప్తంగా కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. జనసేన పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నాయకుడికి పదవులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రనాయక్, మోహన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల శ్రమదానం

నంబులపూలకుంట, జూలై 13: మండలపరిధిలోని ధనియానిచెరువు గ్రామం వద్ద కదిరి రాయచోటి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం మట్టి వేసి పూడ్చి వేశారు. రోడ్డంతా గుంతలమయమై ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు పడేవారు. గుంతల రోడ్డులో ప్రయాణిస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతుండంతో గ్రామ టీడీపీ, జనసేన కార్యకర్తలు మట్టి వేసి చదరం చేశారు. ప్రయాణికులు వారిని అభినందించారు.

రోడ్డంతా గుంతలే..!

ప్రయాణానికి ఇబ్బందులు: చెరువువాండ్లపల్లి వాసులు



గుంతలమయంగా ఉన్న చెరువువాండ్లపల్లి రోడ్డు

నల్లమాడ, జూలై 13: మండల పరిధిలోని చెరువువాండ్లపల్లి రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ తారు రోడ్డును వేసిన ప్పటి నుంచి ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదని అంటున్నారు. రోడ్డు అంతా గుంతలమయం అయిందని... ఈ రోడ్డుపై ఆటోలుకానీ, ద్విచక్రవాహనాలు వెళ్లాలంటే చాల కష్టంగా ఉందని మండిపడుతున్నారు. ఈ రోడ్డుపై పూర్తిగా గుంతలు ఉండడంతో ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆటోల యజమానులు, డ్రైవర్లు వాపోతున్నారు. ప్రయాణికులు కూడా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. రాత్రివేళ ఈ రోడ్డుపై ద్విచక్రవాహనంలో వెళ్లాలంటే ఎక్కడ ప్రమాదాలు జరుగు తాయో అని భయాందోళన చెందుతున్నామన్నారు. ఈ రోడ్డులో వెళ్లా లంటే వాహనదారులతో పాటు పాదాచారాలు కూడా నానా తంటాలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జనం సొమ్ము రాళ్ల పాలు

వృథాగా పడి ఉన్న జగనన్న భూరక్ష రాళ్లు



మండల కేంద్రంలోని 4వ సచివాలయం ఎదుట ఉన్న భూరక్ష రాళ్లు

ముదిగుబ్బ, జూలై 13: గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎలా దుర్వినియోగం చేసిందనడానికి ఈ రాళ్లు నిదర్శనంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న భూరక్ష పథకం కింద మండలంలో భూముల రీసర్వే చేపట్టారు. సర్వే హద్దులు తెలిపేందుకు రాళ్లు నాటాలని నిర్ణయించారు. ఈ రాళ్లపై వైఎస్సార్ జగనన్న భూరక్ష అని కూడా చెక్కించారు. ఈ రీసర్వేపై రైతుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు రావడంతో, పథకం నామమాత్రంగా సాగింది. భూముల హద్దుల్లో నాటేందుకు ప్రజల సొమ్మును వెచ్చించి రాళ్లు కొనుగోలు చేశారు. అవి వందల సంఖ్యలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. మండల కేంద్రంలోని నాలుగో సచివాలయం వద్ద వందలాది రాళ్లు గుట్టలుగా పడి ఉన్నాయి. ఈ రాళ్లను చూసి ప్రతి ఒక్కరు వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఇలా దుర్వినియోగం చేసిందని చర్చించుకుంటున్నారు.

గూగూడు ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు: డీఎం

ధర్మవరం, జూలై 13: ప్రసిద్ధి చెందిన అనంతపురం జిల్లాలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలకు ధర్మవరం డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం సత్యనారాయణరావు తెలిపారు. ఆయన శనివారం తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక బస్సులు ఆదివారం నుంచి ఈ నెల 18వతేదీ వరకు అందు బాటులో ఉంటాయన్నారు. బత్తలపల్లి నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రతి పౌర్ణమికి ధర్మవరం నుంచి అరుణాచలానికి బస్సు సర్వీసు ఉంటుందన్నారు. కొత్తగా ఆయోధ్య, కాశీకి బస్సులను ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. ఎవరైనా బృందంగా వస్తే బస్సు పంపుతామన్నారు. ధర్మవరం నుంచి చెన్నైకి ఇటీవలే బస్సు ప్రారంభించామన్నారు. ఈ సర్వీసులో తిరుమలకు కూడా టికెట్లు ఇస్తామన్నారు. ఈ సర్వీసు ధర్మవరం నుంచి రాత్రి 8గంటలకు బయలు దేరి కొత్తచెరువు, నల్లమాడ, వెంగళమ్మ చెరువు, కదిరి మీదుగా తెల్లవారుజామున 3-30 గంట లకు చేరుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఐ-3 శ్రీరాములు, సిస్టం సూపర్‌వైజర్ సుధాకర్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

20న అరుణాచలానికి...

పుట్టపర్తి, జూలై 13: అరుణాచల గిరిప్రదర్శనకు ఈనెల 20న రెండు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఆసక్తి గల భక్తులు అన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్‌చేసుకోవచ్చని డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న పేర్కొన్నారు. రానుపోను టిక్కెట్లు రూ. 1350 అన్నారు. వివరాల కోసం ఫోన్ నంబర్లు 9959225857, 7382860486, బుకింగ్ కౌంటర్ 9440201570ను సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి ఉచిత వైద్యశిబిరాలు

పుట్టపర్తి రూరల్, జూలై 13: శ్రీసత్యసాయి గ్లోబల్‌కౌన్సిల్ (యునైటెడ్ కింగ్‌డమ్) నుంచి పుట్టపర్తికి వచ్చిన డాక్టర్ల బృందం నల్లమాడ మండలంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయిగ్లోబల్ కౌన్సిల్ యూరోప్ జోన్ ఛైర్మన్ ఫిలిప్ శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ సూచనల మేరకు నల్లమాడ మండలం దొన్నికోట ప్రభుత్వపాఠశాలలో సోమవారం, కొండకింద తండా గ్రామంలో ఈనెల 16న, చారుపల్లిబడవాండ్లపల్లి ప్రభుత్వపాఠశాలలో ఈనెల 17న వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాల్లో దాదాపు అన్ని రకాల రోగాలు, సమస్యలపై నిపుణులైన డాక్టర్ల బృందం ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తుందని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు భోజన సదుపాయం కూడా కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేమకల్లు ఆంజనేయుడికి విశేష పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న బళ్లారి అడిషనల్ ఎస్పీ

బొమ్మనహాళ్, జూలై 13: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు వేకువజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు. తర్వాత విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు, నైవేద్యం సమర్పణ గావించి మహామంగళహారతి ఇచ్చారు. బళ్లారి అడిషనల్ ఎస్పీ రవికుమార్ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ నాయకులు గాలి బసప్ప తదితరులు ఏఎస్పీని స్వాగతించి పూజలు జరిపించారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తాడిపత్రి, జూలై 13: పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు పీరా (65) మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పీరా వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవారు. ఓ పని నిమిత్తం శనివారం ఆయన బైక్‌పై తాడిపత్రికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా.. ఆటోనగర్ సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య హుస్సేన్‌బీతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు టోపీసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం పడింది. రాయదుర్గం, డి.హిరేహాల్ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. అనంతపురం, గార్లదిన్నె, నార్పల, ఉరవకొండ, గుత్తి, పుట్లూరు, బొమ్మనహాల్, యాడికి తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

అనుమానాస్పద స్థితిలో బేకరీ మాస్టర్ మృతి

గోరంట్ల, జూలై 13: పట్టణంలోని సాదిక్‌లాడ్జి వెనుక ఇంటిలో అద్దెకుంటున్న బేకరీ మాస్టర్ మహమ్మద్‌రఫీ (36) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ధర్మవరానికి చెందిన మహ్మద్‌రఫీ ఏడాదిగా గోరంట్లలోని రాఘవేంద్ర బెంగళూరు బేకరీలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. బేకరీలో పని చేస్తున్న నలుగురు వర్కర్లతో పాటు ఈయన ఒకే గదిలో నివాసం ఉండేవారు. అయితే భవనం చివరి అంతస్తుపైన వాటర్ ట్యాంక్ వద్ద మహ్మద్‌రఫీ మృతి చెందినట్లు శనివారం ఉదయం తోటి వర్కర్‌లు గుర్తించా రు. మృతుడి గొంతు భాగం, ముఖంపైన కళ్ల నుంచి రక్తస్రావం జరిగిన గాయాలు కనిపిస్తున్నాయి. సంఘటనా స్థలంలో వాటర్ బాటిల్, గ్లాసులో మద్యం, మద్యం సీసా, సెల్‌ఫోన్ లభించినట్లు పోలీసులు తెలిపారు. గదిలో మిగిలిన వర్కర్‌లను విచారించగా శనివారం మృతుడి మ్యారేజ్ డే అని, ఇంటికి వెళ్తానని, డబ్బులు కావాలని యజమానిని శుక్రవారం అడిగాడన్నారు. ఆయన శనివారం ఉదయం ఇస్తానని చెప్పాడన్నారు. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి మహమ్మద్ రఫీ మద్యం సేవిస్తుండగా తాము గదిలో నిద్రించామన్నారు. ఉదయం చూడగా మరణించినట్లు పేర్కొన్నారు. అయితే బేకరీ దుకాణం వద్ద రాత్రి వర్కర్‌ల మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య తస్లీం, కుమార్తె మెహర్‌సునీమ్, కుమారులు షేక్షావలి, షాషావలి ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సబ్ కలెక్టర్ అపూర్వభరత్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పెనుకొండ, జూలై 13: ఉపాధ్యాయులు ఒత్తిడిలేని బోధన చేయడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పేర్కొన్నారు. యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాస్థాయి క్రీడోత్సవం ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో ప్రారంభించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యూటీఎఫ్ ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్, నరేష్, హరిక్రిష్ణ, బూతప్ప, నారాయణస్వామి, మహాలింగప్ప, నబి, మారుతి, శేషాద్రి, చెన్నకేశవులు, కృష్ణానాయక్, నాగార్జున, తెలుగునాడు విద్యుత్‌శాఖ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న ఎస్సీ హాస్టల్ భవనం



పెచ్చులూడిన హాస్టల్ పైకప్పును పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం అర్బన్, జూలై 13: మండలంలోని మలుగూరు ఎస్సీ హాస్టల్ భవనం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి పేర్కొన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు మలుగూరు హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని తమకు విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని విద్యార్థులు భయపడుతున్నారన్నారు. గంథ్రాలయం, మెస్‌హాల్ పూర్తిగా శిథిలమయ్యాయని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, హసేన్, అఫ్రిద్, సురేష్, విక్రమ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై 21 నుంచి విచారణ

సోమందేపల్లి, జూలై 13: మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై ఈనెల 21 నుంచి విచారణ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ బృందం సమావేశం నిర్వహించింది. మండలంలోని పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులు, పంచాయతీ రాజ్ పనులకు సంబంధించిన మస్టర్లు, ఎంబుక్కులను తనిఖీ బృందానికి అప్పగించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఆయా పనుల వివరాలను అందించారు. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ చేపట్టనున్నట్లు సీఆర్పీ చంద్రమోహన్ తెలిపారు. అనంతరం ప్రజావేదిక ద్వారా వివరాలను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

చిలమత్తూరు, జూలై 13: మండలంలోని దేమకేతేపల్లి ఉన్నత పాఠశాలలో 1999-2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. స్నేహితులను ఆప్యాయంగా పలుకరించారు. నాటి గురువులను పిలిపించి, ఆశీర్వాదం అందుకున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

పెనుకొండ, జూలై 13: డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి గడువు 20 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కేశవరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్లతో కళాశాల హెల్ప్‌డెస్క్‌తో సంప్రదించాలన్నారు. బీఎస్సీలో మ్యాథ్స్ జువాలజీ, కంప్యూటర్‌సైన్స్, అకౌంట్స్, బీఏలో హిస్టరీ కోర్సులు తమ కళాశాలలో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో చేరడం ద్వారా సర్టిఫికెట్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తాడిపత్రి, జూలై13: పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు పీరా (65) మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పీరా వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవారు. ఓ పని నిమిత్తం శనివారం ఆయన బైక్‌పై తాడిపత్రికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా.. ఆటోనగర్ సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య హుస్సేన్‌బీతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు టోపీసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం పడింది. రాయదుర్గం, డి.హిరేహాళ్ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. అనంతపురం, గార్లదిన్నె, నార్పల, ఉరవకొండ, గుత్తి, పుట్లూరు, బొమ్మనహాల్, యాడికి తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

నేడు బాలయ్య రాక



సోమఘట్టలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన వాటర్ ప్లాంట్

హిందూపురం/చిలమత్తూరు, జూలై 13: స్థానిక శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ఒక రోజు పర్యటనలో భాగంగా ఆదివారం హిందూపురానికి రానున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం బెంగళూరు విమానాశ్రయం నుంచి నేరుగా 44 వ జాతీయ రహదారిపై చిలమత్తూరు మండలం సోమఘట్టకు చేరుకుంటారన్నారు. అక్కడ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారు. కొటిపి వద్ద టిడ్కో ఇళ్లు పరిశీలించి, సమీపంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారని తెలిపారు. అనంతరం హిందూపురంలోని పరిగి బస్టాండువద్ద రూ.45లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తారన్నారు. తర్వాత నానెప్పనగర్‌లోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌వద్ద కైవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. మధ్యాహ్నం ఎమ్మెల్యే నివాసంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితోపాటు పలుశాఖల అధికారులతో సమీక్ష జరుపుతారని వివరించారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన తరువాత గ్రామాల్లోకి వస్తున్న బాలయ్యకు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ క్యాడర్ ఉత్సాహంగా ఎదురుచూస్తోంది.

అనుమానాస్పద స్థితిలో బేకరీ మాస్టర్ మృతి

గోరంట్ల, జూలై 13: పట్టణంలోని సాదిక్‌లాడ్జి వెనుక ఇంటిలో అద్దెకుంటున్న బేకరీ మాస్టర్ మహమ్మద్‌రఫీ (36) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ధర్మవరానికి చెందిన మహ్మద్‌రఫీ ఏడాదిగా గోరంట్లలోని రాఘవేంద్ర బెంగళూరు బేకరీలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. బేకరీలో పని చేస్తున్న నలుగురు వర్కర్లతో పాటు ఈయన ఒకే గదిలో నివాసం ఉండేవారు. అయితే భవనం చివరి అంతస్తుపైన వాటర్ ట్యాంక్ వద్ద మహ్మద్‌రఫీ మృతి చెందినట్లు శనివారం ఉదయం తోటి వర్కర్‌లు గుర్తించా రు. మృతుడి గొంతు భాగం, ముఖంపైన కళ్ల నుంచి రక్తస్రావం జరిగిన గాయాలు కనిపిస్తున్నాయి. సంఘటనా స్థలంలో వాటర్ బాటిల్, గ్లాసులో మద్యం, మద్యం సీసా, సెల్‌ఫోన్ లభించినట్లు పోలీసులు తెలిపారు. గదిలో మిగిలిన వర్కర్‌లను విచారించగా శనివారం మృతుడి మ్యారేజ్ డే అని, ఇంటికి వెళ్తానని, డబ్బులు కావాలని యజమానిని శుక్రవారం అడిగాడన్నారు. ఆయన శనివారం ఉదయం ఇస్తానని చెప్పాడన్నారు. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి మహమ్మద్ రఫీ మద్యం సేవిస్తుండగా తాము గదిలో నిద్రించామన్నారు. ఉదయం చూడగా మరణించినట్లు పేర్కొన్నారు. అయితే బేకరీ దుకాణం వద్ద రాత్రి వర్కర్‌ల మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య తస్లీం, కుమార్తె మెహర్‌సునీమ్, కుమారులు షేక్షావలి, షాషావలి ఉన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్పించడానికి కృషి చేయండి

కేంద్రమంత్రికి వాల్మీకుల వినతి



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

అగళి, జూలై 13: అత్యంత వెనుకబడిన వాల్మీకి కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, వాల్మీకి కులస్థులు కేంద్ర మంత్రి సోమణ్ణని కోరారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వాల్మీకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో చేర్చాలని వారు విన్నవించారు. హిందూపురంఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామికి వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉందని వాల్మీకి కులస్థులందరూ ఎన్డీఏ కూటమికి మద్దతు పలికారన్నారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీలకు అతీతంగా వాల్మీకులను ఆదుకుని ఎస్టీ జాబితాలో చేర్పించాలని వారు విన్నవించారు. అనంతరం కేంద్ర మంత్రి సోమణ్ణకు శాలువ కప్పి పూలమాలువేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జడ్పీటీసీ ఉమేష్, శివన్న, తిప్పేస్వామి, కత్రియన్న, రాజు, మాధవరాజు, ఓబులేసు, ఓబన్న, రమేష్, నాగరాజు, వాల్మీకి సోదరులు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ



రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న రైతులు

పావగడ, జూలై 13: రైతు సమస్యలను పరిష్కరించాలంటూ కర్ణాటక రాష్ట్రం రైతు సంఘం, హసిరుసేన ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి శనీశ్వరం సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చిన రైతులు ఆర్ఎంసీ మార్కెట్ యార్డులో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బసవరాజు మాట్లాడుతూ పావగడలోని అనేక గ్రామాల్లో రైతు పొలాలకు దారిలేకుండా ఉన్నాయని వాటికి దారి చూపించాలని డిమాండ్ చేశారు. బీడుభూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలిచ్చి చట్టబద్ధం చేయాలన్నారు. రైతులకు అన్నివిధాలుగా పట్టా పుస్తకాలున్నప్పటికీ అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారుల నుంచి ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న తాలూకా కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్లు ఆయన తెలిపారు. తాలూకా అధ్యక్షుడు పూజారప్పను జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ ఉపాధ్యక్షుడిగా హనుమంతరాయప్ప, ప్రధాన కార్యదర్శిగా యతిత్‌కుమార్, కార్యదర్శిగా రామాంజినప్పను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు.

లోక్ అదాలత్‌తో ఎంతోమందికి ఊరట

పావగడ, జూలై 13: రైతులు, సామాన్యులకు లోక్ అదాలత్ ద్వారా ఎంతో ఊరట లభిస్తున్నట్లు బార్‌అసోసియేషన్ సభ్యులు హెచ్ శేషానంద తెలిపారు. శనివారం లోక్ అదాలత్‌ఉ నిర్వహించారు. మొత్తం కేసులో రూ.1,57,47,565లు వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఓటీఎస్ పద్ధతిలో విముక్తి కలిగించేందుకు ఈ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి మాదేశ్ తెలిపారు. న్యాయమూర్తి మాదేష్ తరుపున 101కేసులో 33 పరిష్కారం కాగా ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి సుధీర్ తరుపున 468కిగాను435కేసులు పరిష్కారమయ్యాయి. అదేవిధంగా అడిషనల్ సివిల్‌జడ్జి ప్రియాంక తరపున 407కు 381పరిష్కారమైనట్లు అధికారులు వెల్లడించారు.

ఆదెప్ప హంతకులను వదిలిపెట్టం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, జూలై 13: మెచ్చిరి గ్రామంలో టీడీపీ నాయకుడు ఆదెప్ప రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక వైసీపీ గూండాలు అతి కిరాతకంగా హత్య చేశారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. హత్యకు సహకరించిన వారెవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. మెచ్చిరి గ్రామానికి వెళ్లి ఆదెప్ప కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. వారికి రూ.50 వేలు సాయం అందించారు. పార్టీ తరపున మరో రూ.2 లక్షలు ఇస్తామని తెలిపారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆదెప్ప హత్యకు సూత్రధారి అయిన కేశవరెడ్డి పాత్ర నామమాత్రమేనని, హత్యకు సహకరించిన గ్రామ సర్పంచ్ తనయుడు చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో 15 మందికి కూడా శిక్ష పడేలా చూస్తామని అన్నారు. ఆదెప్ప గ్రామంలో పెద్ద మనిషిలా వ్యవహరిస్తుండేవాడని, ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం బీసీ, ఎస్సీ నాయకులను కలుపుకుని పనిచేశారని అన్నారు. కేవలం రాజకీయంగా ఎదుగుతున్నాడనే కక్షతోనే మూడురోజులు రెక్కీ నిర్వహించి దారుణంగా హత్య చేశారని అన్నారు. ఈ హత్య గురించి సీఎం చంద్రబాబుతో చర్చించామని తెలిపారు. హత్య చేసినవారు గ్రామంలో తిరుగుతున్నారని, పోలీసుల మెతక వైఖరే దీనికి కారణమని బాధిత కుటుంబం అంటోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచులు వన్నూరుస్వామి పాల్గొన్నారు.

రిజర్వ్ ఫారెస్ట్ తనిఖీ

అనంతపురం న్యూటౌన్, జూలై 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌ను శనివారం స్క్వాడ్ రేంజర్ వెంకటరమణ తనిఖీ చేశారు. ముచ్చుకోట రిజర్వ్ ఫారెస్ట్, బెళుగుప్ప రిజర్వ్ ఫారెస్ట్‌లోని బౌండరీలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఎక్కడ రిజర్వ్ ఫారెస్ట్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడటంలో భాగంగా బౌండరీలు పరిశీలించామన్నారు. స్థానిక సిబ్బంది చేపట్టిన పనులను కూడా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో బీట్ ఆఫీసర్ ప్రతాప్‌తో పాటు స్థానిక సిబ్బంది జగన్నాథ్, సుధాకర్ ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

నల్లచెరువు, జూలై 13: మండల పరిధిలోని ఎన్‌హెచ్ 42 జాతీయరహదారిపై ఎర్రగుట్లపల్లి వద్ద చెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి(41) కుటుంబసభ్యులతో శనివారం ఉదయం కారులో తిరుపతికి వెళుతున్నాడు. నల్లచెరువు సమీపంలో ఎర్రగుంట్లపల్లి వద్ద కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారులో అయిదుగురు ఉండగా ముగ్గురికి తీవ్రగాయాలు కాగా ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మిగిలిన ఇద్దరిని కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

అనంత ఎస్పీగా మురళీకృష్ణ

అనంతపురం క్రైం, జూలై 13: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్పీల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా అనంత జిల్లాకు కేవీ మురళీకృష్ణను నియమించారు. అనకాపల్లి ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న మురళీకృష్ణను ఇక్కడకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ గౌతమిశాలిని విజయవాడలోని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ.. బదిలీ చేశారు. ప్రభుత్వం 37 మంది ఐపీఎస్ అధికారులను శనివారం బదిలీ చేసింది.

ముగిసిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ

అనంతపురం టౌన్, జూలై 13: క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహణపై వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణ తరగతులు శనివారం ముగిసినట్లు డీఎంహెచ్ఓ ఈబీ దేవి తెలిపారు. నెలరోజులుగా జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శిక్షణ ఇచ్చామన్నారు.

దొంగ అరెస్ట్

● 15 తులాల బంగారం స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆరోహణరావు

బత్తలపల్లి, జూలై 13: పట్ట పగలే ఎవరూలేని సమయంలో ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడే ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ ఆరోహణరావు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను ఆయన గురు వారం విలేకరులకు వెల్లడించారు. ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన షేక్ ఖాజా పీరా చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. వాటితో పాటు కుటుంబ పోషణ కోసం దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. గత నెల 21న మండలకేంద్రమైన బత్తలపల్లిలోని వినాయక నగర్‌లో మల్లెల రామాంజినేయులు ఇంటికి తాళం వేయకుండా స్నా నానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేరని గమనించిన ఖాజా పీరా ఆ ఇంట్లోకి చొరబడి బీరువాను బద్దలు కొట్టి అందులోని బంగారు ఆభరణాలు ఎత్తికెళ్లాడు. కొంతసేపటికి తిరిగి వచ్చిన రామాంజినేయులు భార్య జ్యోతి దొంగతనం జరిగిందని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిలమత్తూరు మండలం మరవ కొత్తపల్లిలోనూ ఇదే తరహాలో దొంగతనం చేశాడు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టీం గాలింపుచర్యలు చేపట్టింది. బత్తలపల్లిలోని అన్నపూర్ణ దాబా వద్ద ఖాజా పీరాను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 15 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. తమ బంగారం నగలను రికవరీ చేయడంతో మల్లెల రామాంజినేయులు సీఐ ఆరోహణరావు,ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని సన్మానించారు.

నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి కృషి: టీడీపీ



సమావేశమైన టీడీపీ శ్రేణులు

పెనుకొండ, జూలై 13: నియోజకవర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి మంత్రి సవిత కృషి చేస్తున్నట్లు టీడీపీ స్థానిక నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మంత్రి సంప్రదింపులతో ఇస్కాన్ సంస్థ పెనుకొండ కొండపై 108అడుగుల లక్ష్మీనరసింహస్వామి ఏకశిల రాతివిగ్రహం ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య, బీజేపీ రామక్రిష్ణ, రామలింగ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, రఘువీరచౌదరి, షౌకత్, బాబిరెడ్డి, రమణమ్మ, పూలశీన తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు బీకే నివాళి



కార్యకర్త మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీకే పార్థసారథి

పెనుకొండ రూరల్, జూలై 13: మృతి చెందిన టీడీపీ కార్యకర్తకు ఎంపీ బీకే పార్థసారథి శనివారం నివాళులర్పించారు. రొద్దం మండలంలోని గోనిమేకలపల్లిలోని టీడీపీ కార్యకర్త కురుబ ఈశ్వరప్ప శనివారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ గ్రామానికి చేరుకుని ఈశ్వరప్ప భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, అధికార ప్రతినిధి నరసింహులు, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, మురళి, చంద్రశేఖర్‌నాయుడు, ఇమాం, నాగరాజు, అశ్వర్థ, ఆదినారాయణ, డీకే బాబు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ పట్ల యూటీఎఫ్ అభ్యంతరం

పెనుకొండ, జూలై 13: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ నాయకులు గెజిట్ కాపీలను దహనం చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గెజిట్ నోటిఫికేషన్ కాపీలను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బ్యాక్ డేట్‌తో జీపీఎస్ అమలు చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిక్రిష్ణ, నారాయణస్వామి, గంగాధర్, మారుతి, చెన్నకేశవులు, ఆది, దినేష్, నర్సింహులు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే భవిష్యత్తు



మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

హిందూపురం, జూలై 13: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షిస్తేనే భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారవుతారని పరిగి ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. కొడిగెనహళ్లి పంచాయతీ పరిధి భక్త మార్కండేయ ఆలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ సేవా సమితిసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

హిందూపురం, జూలై 13: పరిగి మండలం పెద్దరెడ్డిపల్లిలో విద్యుదాఘాతంతో శనివారం ఓ పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన శ్రీరామప్ప పాడి ఆవు రోడ్డుపక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేయడానికి వెళ్లింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో ఆవు దానిని తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. పాడి ఆవు రూ.50వేలు అని రైతు తెలిపాడు.

21న దత్తాత్రేయస్వామి బ్రహ్మరథోత్సవం

మడకశిర రూరల్, జూలై 13: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ప్రసిద్ధి చెందిన చంద్రబావి గ్రామంలో వెలసిన దత్తాత్రేయస్వామి బ్రహ్మరథోత్సవం ఈ నెల 21న వైభంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామి వారికి కాగడ హారతి, 8 గంటలకు పంచామృతాభిషేకం, నవగ్రహ పూజ, 11.30 గంటలకు స్వామివారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తామన్నారు.

కార్బన్ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

అనంతపురం న్యూటౌన్, జూలై13: కార్బన్ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు ఆగ్రిఫారెస్ట్రీ 2024-25 ప్రాజెక్ట్‌లో భాగంగా రెన్యూ, సేవ్రీ, హ్యాండ్ సంస్థలు సంయుక్తంగా గుత్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా చేపట్టే అంశాలను రైతులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు లాభసాటిగా ఉండేలా పండ్ల మొక్కలు పెంచడంపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎర్రచందనం, టేకు, మహాగని లాంటి మొక్కలు అటవీశాఖ నుంచి ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. వాటిని పెంచడం ద్వారా రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. సదస్సులో రెన్యూ ప్రతినిధులు కార్తీక, వపన్ భగవతి, ఇందుశ్రీ, హర్షితా చావ్లా, సేవ్రీ ప్రతినిధులు మహీధర్‌రెడ్డి, అనురాగ్, మనోహర్, హేమేంద్ర, పీరావలీ, నారాయణస్వామి, శివశంకర్‌తో పాటు ఐదు మండలాల నుంచి రైతులు పాల్గొన్నారు.